# కోరికలు

భానుమతి

ప్రతివాళ్ళూ జీవితంలో ఏవో కొన్ని కోరికలుకోరుకుని తీరలేదన్న కొరతలతో బాధపడుతూంటారు. అలాంటి కోరికల్లో రెండు రకాలున్నాయి. జీవితానికి సంబంధించిన పెద కోరికలూ, నిత్యజీవితానికి సంబంధించిన పిల్ల కోరికలూ. పెద్ద కోరికలు ఆకాలంలో తీరకపోతే,చీడపురుగుల్లాంటి కొరతలు ఆ కోరికలను కొరకడానికి ఆరంభిస్తాయి.

తీరవని తెలిసికూడా మనిషి కోరడం మానలేడు. తుమ్మెద లాంటి మనసును కోరికలమీద వ్రాలకుండా అరికట్టలేడు – కోరిన కోరికలన్నీ తీరితే, జీవితం ఎంతశోభాయమానంగా వుంటుందో వూహిస్తాడు. ఆ వూహాలోని మధురానుభూతినే ఆస్వాదిస్తూ జీవితంలో ముందుకు పోతాడు. తీరవనే కొరతలతో బాధపడి జీవితాన్ని కృంగదీసుకోడానికి ఇష్టపడడు— ఎప్పటికైనా తన కోరికలు తీరకపోతాయా! అనుకుంటూ, ఆత్మవంచన చేసుకుంటూ, ప్రతి క్షణం చస్తూ బ్రతుకుతూ ఆశను నమ్ముకుని అంతులేని ప్రయాణం చేయకపోతే మానవుడు చచ్చిందాకా బ్రతకలేడు.

ఒక్కొక్కసారి కోరికలు గొలుసుల్లాగా మనసును పెనవేస్తాయి. అవి తీరే కోరికల గొలుసులైతే మనసులో వూగే మల్లెమాలలై జీవితాన్ని పరిమళింపజేస్తాయి. అవే తీరని కోరికల గొలుసులైతే, మనసును గుచ్చే ముళ్లతీగలై జీవితాన్ని గాయపరుస్తాయి.

నా స్నేహితురాలు ఒకమ్మాయి ఎప్పుడూ శక్తికిమించిన కోరికలు కోరుకునేది. ఆ అమ్మాయి తండ్రి మధ్యరకం కుటుంబీకుడు. ఒక్కగానొక్క కూతురు అని ఋణంచేసి బి. యస్. సి. దాకా చదివించాడు ఆ అమ్మాయిని. ఆస్తిపాస్తిలేని ఆ అమ్మాయి తండ్రి తన శక్తికి తగినట్లు వరాన్వేషణకు బయలుదేరాడు. కానిఆ అమ్మాయి మనసులోవున్న వరుణ్ణి తేలేకపోయాడు.

## తీరని కోరికలు

ఇంక ఆ అమ్మాయి కోరికలు ఏమిటంటే తను పెండ్లాడబోయే వరుడు తనకన్నా పెద్ద చదువు చదివివుండాలి; విదేశాలకు వెళ్ళందుకు వీలుగావుండే వుద్యోగం చేస్తుండాలి. కనీసం ఇండియా అంతటా అయినా తిరిగి చూసే అవకాశంవుండే పెద్దవుద్యోగి అయివుండాలి; వెయ్యి రూపాయలైనా జీతం తెచ్చేవాడుగా వుండాలి; అందమైనవాడై వుండాలి; నల్లగావుండే వాడైతే, చస్తే చేసుకోనన్నది. అసంభవమని ఆ అమ్మాయి అంతరాత్మ ఘోష పెడుతున్నా, వినిపించుకోకుండా తన అందమైన తీయనికోరికలు తీరుతాయనే ఆశను నమ్మింది. తను అందమైనదేగా! ఒకవేళ కట్నాలూ కానుకలూ లేకుండా తనుకోరుకున్న వరుడు దొరుకుతాడేమో? ఆశ అనేది మనిషిని కోరికల గొలుసుకు కట్టేసి లాక్కుపోతూంటుంది. అంతగా ఆశపడ్డ నా స్నేహితురాలి వివాహం ఆ అమ్మాయి కోరికలకు విరుద్ధంగానే జరిగింది. 'నల్లనివాడు పద్మనయనమ్ములవాడు' భర్త అయినాడు! అతడు బి. యస్ సి. దాకానే చదివాడు. మారుమూల వూర్లో రైల్వేలో వుద్యోగం; నూరురూపాయిలజీతం. ఆస్తిపాస్తీ లేని బీదవాడా అబ్బాయి.

నా స్నేహితురాలి కోరికలన్నీ ఏమయినాయి? స్వరూపంలేని గాలిలాంటి మనసు కోరే హద్దులేని కోరికలవల్ల మోసపోయిన ఆ అమ్మాయి జీవితం మొదటి మెట్టులోనే కుంటుబడ్డది!

## మారిన కోరికలు

తీరని కోరికలు కలిగించిన మనసులోని గాయాన్ని మాన్పడానికీ, తను జీవించడానికి
కొత్త కోరికలు కోరుకోడం మొదలెట్
తన భర్తకు ఏదైనా బస్తీకి బదిలీ అం
తను ఏవైనా కొత్త సినిమాలు చూడవ
రైల్వే ఆఫీసరుగారి అమ్మా
చేతికి పెటుకున్న నాలుగు వందలరు
యల రిస్టువాచీలాంటిది తన చేతికి పె
వాలని కోరుకున్న నా స్నేహితురాలి క
కోరికలకు కూడా కొరతలే అడ్డొచ్చాయి

ఆస్తీపాస్తీలేని తన భర్త అంత ఖరీ
రిస్టువాచీ తనకి జన్మలో కొనివ్వలే
తనకు తెలుసు కాని, కోరికలకేం తెల
ఇలాంటివాళ్ళు అలివిమాలిన కోర
కోరుకుని తల తీసికెళ్ళి గోడకు మోదిన
జీవితాన్ని కొరతలతో కొరతవేసి హి
పెట్టుకుంటూరు.

కొన్ని కోరికలు సూదుల్లాగాకలిగి,
అవకాశం వుండి కూడా తీరకపోయే
అవి దబ్బణాల్లాగా తయారవుతా
అలాంటిదే వృద్ధాప్యదశలో పడ్డ మా అ
చిన్నకోరిక ఒకటివుండేది. ఆమె పెళ్ళం
కొత్తల్లో, ఆవూరి కరణంగారి కోడలు
బస్తీనుంచి వచ్చిన భారతమ్మ—మెడ
బంగారు నల్లపూసలు గొలుసు వుండేది
అలాంటి నల్లపూసల బంగారుగొలుసు తన
కావాలని చాలాకాలం మా నాన్న
చెప్పిచెప్పి నోరు కాయగాచిందట.
మా నాన్న వుద్యోగపు హడావిడిలో మ
పోయాడో, లేక, అదేమంత పెద్దనగలే
నిర్లక్ష్యపరిచాడో మొత్తానికి ఆమె చి



విజయకృష్ణ

కోరికను నాన్న తీర్చలేకపోయాడు. అభిమానంగల మా అమ్మకూడా ఆ తర్వాత అడగటం మానేసిందట నాన్నను. మేము పుట్టక మునుపు అమ్మ మనసులో పుట్టిన కోరిక పెరిగి పెద్దయి నా పెళ్ళినాటికి వృద్ధాప్య దశలో వుంది. నా పెళ్ళయిన వెంటనే అమ్మకోసం ప్రత్యేకంగా బంగారులో నల్ల పూసలు చుట్టించి అపూటు చిన్న పండగచేసి నాన్న చేత అమ్మ మెళ్లో వేయించాను. అంత కాలంగా మా అమ్మ మనసులోని కోరికను అలక్ష్యంగా వదిలి వేసినందుకు మా నాన్న చాలా బాధపడ్డాడు. అప్పటికే అమ్మ కోరిక ముసలిదయిపోయి ఉక్కి మంచంలో కునుకు తీస్తోంది. కాసేపు మెడలో వేసుకోడానికే ఎంతో సిగ్గుపడిపోయింది అమ్మ.

"ఎప్పుడో చిన్నతనంలో మీ నాన్నను ఇలాంటి నల్లపూసల గొలుసు కావాలని అడిగాను. ఏమిటో ఇంకా నాకెందుకు తల్లీ ఇవన్నీ చిన్నపిల్లలాగా...నీవు మెడలో వేసుకుంటే చూసి సంతోషిస్తాను." అంటూ నల్లపూసల గొలుసుతీసి నా మెడలో వేసింది అమ్మ.

## వ్రతం చెడ్డా....

ఆరోగ్యంగా వున్నప్పుడు కొందరు కడుపునిండా అన్నం దొరక్క అవస్థ పడతారు. కడుపునిండా అన్నం దొరికేసరికి అజీర్ణ వ్యాధితో తిన్నది అరగక బాధపడతారు.

కొందరి కోరికలు తమాషాగానే వుంటాయి. పెద్దకోరికలు తీరవని తెలిసి నీళ్ళు వదులుకున్న తర్వాత, పిల్లకోరికల కోసం మొండిపట్టు పడతారు కొందరు. బహుశా పెద్దకోరికలు తీరలేదన్న ప్రతీకారం చిన్నకోరికలద్వారా తీర్చుకుంటారేమో!

మా పక్కింటావిడ తనభర్త రవ్వల కమ్మ చేయించలేదని బ్రతికి నన్నాళ్లూ చెవులు బోసిగానే వుంచుకున్నది. రవ్వలు మనకు అచ్చిరావు కాబట్టే చేయించనంటాడు ఆవిడ భర్త. కావాలంటే నీ ఎత్తు బంగారునగలు చేయిస్తాను వేసుకోమన్నాడు. చిన్నప్పటి నుండీ ఒంటినిండా రవ్వలనగలు వేసుకోవాలని కలలుగన్న మాపక్కింటావిడ కలిగినవారి సంబంధం అవగానే రెండవ పెళ్ళికి ఒప్పుకున్నది పాపం......ఒంటినిండా రవ్వలు వేసుకోవచ్చు గదా అన్న ఆశతో...... భర్తమాస్తీ రవ్వలపేరు ఎత్తకూడదని భీష్మించుకు కూర్చున్నాడు. వ్రతంచెడ్డా ఫలం దక్కని ఆవిడ కోరికలు వక్రించాయి! దాంతో ఆవిడ పెదకోరికలు అణుచుకొని కనీసం రవ్వలకమ్మలైనా చేయించమని భర్తను ప్రాధేయపడి అడిగింది—అవీచేయించకపోయేసరికి ఒక్క తాళిబొట్టుతప్ప ఒంటిమీద నగలన్నీ తీసి అవతల పారేసింది. ఇక జన్మలో ఏనగలూ పెట్టుకోనని శపథం చేసింది. బహుశా ఇంక ఏ కొత్తకోరికలూ ఆవిడకు కలిగిన కొరతను పూడ్చలేవు... జీవితంలో మోసపోయిన ఆవిడ యింకే కోరికలూ కోరుకోదు. భర్త పోయాక తన ఇద్దరి కూతుళ్ళు ఒంటినిండా రవ్వలనగలు వేసిచూసి ఆనందించింది. కాని ఆనాటినుండి ఈనాటికీ ఆవిడ ఒంటిమీదఒక్క చిన్నం బంగారం వేసుకోలేదు. పట్టుదలగల మా పక్కింటావిడ ప్రారబ్ధాన్ని ఆవిధంగాకోరికల రూపంలో అనుభవించింది అనాల్సిందే. కర్మానుభవం తప్పనిసరి అయినప్పుడు మనుషులగుణాలు అగ్గికి గుగ్గిలంలాగా తోడ్పడతాయి.కలిమి వుండీ, లేమి అనుభవించిం దావిడ అంటే ఆవిడబుద్ధి కర్మ ననుసరించిందనాల్సిందే!

## కసిపోక మసి పూసుకున్నట్టు

ఆలాంటి పట్టుదల గల ఆడవాళ్లలో మా అత్తగారు ఒకర్తె. మా పక్కింటావిడ పట్టుదలలో కాస్త అర్థం వుందనిపిస్తుంది; కాని, మాఅత్తగారి పట్టుదలలో అనర్థం కన్పిస్తుంది. సిరికలవారింట బుట్టి ఏడువారాల సొమ్ములూ కాపరానికొస్తూ పుట్టింటి నుండి తెచ్చుకున్నది అత్తవారింటికి. మళ్ళీ అన్ని సొమ్ములూ అత్తింటివాళ్ళు చేయించాలని పట్టుపట్టి సాధించడం మొదలెట్టిందట. "ఉన్న నగలే మళ్ళీ చేయించడం ఎందుకు?" అని మా మామగారు అంటే "పుట్టింటివాళ్లు ఇచ్చారు గదా అని అత్తింటివాళ్లు కోడలికి సొమ్ము చేయించకూడదా?" అని మా అత్తగారు మామగార్ని వేధించేదట. ఆవిడ పోరు పడలేక ఏ వూరైనా క్యాంపుకు వెళ్లిపోయేవారట మా మామగారు-కసిపోక మసి పూసుకున్నట్టు, భర్తమీద కోపంతో పుట్టింటివారిచ్చిన నగలన్నీ చితక్కొట్టించి, బంగారం ముద్ద చేయించి పెట్టెలో దాచిందట. ఒకరోజు దొంగలుపడి, ఆబంగారాన్ని ముద్దతోబాటు, మరికొన్ని వెండి సామానులు కూడా దోచుకుపోయారట. నిన్న మొన్నటి వరకూ మా అత్తగారు ఎప్పుడు చెప్పినా తన కోరిక తీరలేదు గాబట్టే, ఎవరికీ దక్కకుండా తన పుట్టింటివాళ్ల సొమ్ము భగవంతుడు పట్టుకెళ్ళిపోయాడు అని అంటూండేది.



# ★ కోరికలూ - కొరతలూ ★

"భగవంతుడు పట్టికళ్ళినా భాగుంటేది! కొంగాడి తీళ్లాడే అనే నాబాధ" అంటూ ఉండేవారు మా మామగారు. మా అత్తగారి కోరికకు యీనాటికీ వృద్ధాప్యమూ రాలేదు; వయసూ మళ్లలేదు - చెక్కు చెదరకుండా ఉంది ఆమె కోరిక.

చనిపోయిన మా మామగారే బ్రతికి వచ్చి "ఇందా నీవడిగిన ఏడువారాల అత్తింటి నగలు తీసుకో" అంటే ఎగిరి గంతేసి అంది పుచ్చుకుంటుందేగాని, "ఎందుకులెండి యింకా యీ వయసులో నగలు కావాలన్న కోరిక!" అని అనే స్వభావంగాదామెది. ఇలాంటి తృప్తి లేనివాళ్ళ కోరికలూ కొరతలూ వింటుంటే "అయ్యో పాపం!" అనిపించకపోగా ఒళ్ళు మండుతుంది.

## పెద్ద కోరికలు

కోరికలు కోరడంలో పెద్దవాళ్ళెంతో పిల్లలూ అంతే — కోరికలకు పెద్దా చిన్నా లేదని మనుషులకే తెలియాలి — పెద్దవాళ్ళు చిన్న కోరికలకోసం బాధపడ్తుంటే, చిన్నవాళ్లు పెద్దకోరికలకోసం బాధపడతారు.

మా ఎదురింటి ఆచార్లగారి ఆరేండ్ల అబ్బాయి మురళీ వున్నట్లుండి ఒకరోజు తల్లి చేత దెబ్బలు తిన్నాడు. ఏమిటని విచారిస్తే, వాడు బడి వేసుకొలుకు పక్క వీధినుంచి ఒక పెద్ద కొత్త కారులో వస్తున్నాడట పదేండ్ల కుర్రాడు. అలాంటి కారు నాకూ కొనమని తల్లిని వేధించడం మొదలెట్టాడట — తల్లి నయానా భయానా చెప్పిచూసింది. వినకపోయేసరికి నాలుగు తగలనిచ్చింది. వాడు ఏడుపు లంకించుకున్నాడు. అయినా అంత చిన్న వెధవకు అంత పెద్దకోరిక ఎందుకు కలగాలి! ఏ పప్పరమెంటో, ఏ కొత్త చొక్కానో కావాలని కోరాలి గాని కారు కావాలనే పెద్దవాళ్ళ కోరికను వాడెందుకు కోరాలి? సాయంకాలం వాళ్ల నాన్న ఇంటికి రాగానే వాడి ఏడుపు మాన్పించడానికి ఒక ఆడుకునే కొయ్యకారు కొని తెప్పించి యిచ్చాడు. "యిది కాదు పెద్దకారు" అని ఏడ్చాడు. ఎంత చెప్పినా వినకపోయేసరికి తండ్రికూడా మురళీని నాలుగు దెబ్బలు కొట్టాడు. ఏడ్చేడ్చి నిద్రపోయిన మురళీ తెల్లవారి నిద్ర లేచేసరికి వాడంటే ఎంతో ప్రాణంగా చూసుకునే తలిదండ్రులు వాడిపక్కన కూచుని మంచి మాటలు చెప్పి బుజ్జగించారు. పసికూనను



రచయిత్రి

కొట్టినందుకు ఎంతో బాధపడ్డారు. "నువ్వు పెద్దవాడవై, బాగా చదువుకుంటే, మంచి కొత్తకారు కొంటాను" అని మురళీ వాళ్ళ నాన్న చెప్పిన మాటలు మురళీకి నచ్చాయి. అప్పటికా కొయ్యకారుతో ఆడుకుని తృప్తపడ్డాడు. అంతటితో ఆకోరికను వాడు మర్చిపోయినట్లేనా! లేదు పక్కవీధి కుర్రవాడు కార్లో స్కూలుకు వచ్చినప్పుడల్లా వాడి మనసులో కారుకావాలన్న కోరిక కలకవేస్తూనే వుంటుంది!

మరి పెద్దకారు కావాలన్నావు గదరా! మీ నాన్న కొనలేదేం! అని నేనడిగితే "నేను పెద్దవాడు అయ్యాక నాన్న తప్పక కొంటానన్నారుగా! పెద్ద, మంచి, కొత్త కారూ!" అన్నాడు తను త్వరగా పెద్దవాడైతే కారువస్తుందనే గంపెడాశతో వున్న మురళీ.

ఆశ అనేది కోరికలకు పట్టుకొమ్మ. ఆ కొమ్మ నాధారం చేసుకునే కోరికలు జీవిస్తుంటాయి.

## చిన్నర కాలం

బడబడ మాట్లాడే వ్యక్తులు అల్పసంతోషులు. అలాంటివాళ్లు కోరికలు తీరడానికి తేలిగ్గానూ, అందుబాటులోనూ వుంటాయి- ఒకవేళ తీరకపోయినా కొరతలుగా బాధపడి కృంగిపోకుండా ఎక్కడికక్కడ తృప్తి పడుతుంటారు.

కోరికలు కేవలం మనుష్యుల మనః ప్రవృత్తుల మీద ఎక్కువగా పనిచేస్తాయి. స్వర్గమైనా నరకమైనా మనిషిలోపలే వున్నట్లు, అలాంటివాళ్ళు ఆశను నమ్ముకుని అనవసరమైన కష్టాలకు గురికారు. దొరికిన దానితో తృప్తిపడుతుంటారు. అలాంటి వాళ్ళను కోరికలూ, కొరతలూ ఎక్కువ బాధించవు.

మా బంధువుల్లో ఒకాయన వుండేవాడు. ఆయన జీవితంలో కొరతలను జయించిన మనిషి అనే వారంతా. ఆయనకున్న ఆస్తి పలుగురుపిల్లలూ, ఒకరోగిష్టి భార్యా. ఆయన చేసే నూరు రూపాయల వుద్యోగంలోనే భార్యకు మందులూ, మాకులూ ఇప్పిస్తూ, ఇద్దరు కొడుకుల్ని చదివించుకుంటూ, కుటుంబ పోషణచేయాలి. పెద్దకొడుకును బి. యస్. సి. దాకా చదివించాడు. ఆయనకూ కోరికలు లేక పోలేదు. కాని వాటిని హద్దుల్లో వుంచాడు, కోరికలకు లోబడి తన్నుతాను బాధించుకోడానికి ఇష్టంలేని ఆయన ఫలాపేక్షలేని ప్రయత్నంమాత్రం చేస్తూండేవాడు, ప్రతి విషయంలోనూ.

(53-వ పేజీ చూడండి)

# ★ కోరికలూ - కొరతలూ ★

(30-వ పేజీ తరువాయి)

## కోరిక(ల)లు

బ్యాంకులో వుద్యోగాలకు ఖాళీలున్నాయని తెలిసి వెంటనే కొడుకుచేత అప్లికేషన్లు పెట్టించాడు. మొదటిది నాలుగువందల యాభైరూపాయల వుద్యోగం. ఆ వుద్యోగం దొరకాలనే ఆయన మనసులోని పెద్దకోరిక. కాని అది తీరేఅవకాశాలు చాలా తక్కువని తెలిసిన ఆయన రెండవది రెండువందల యాభై రూపాయల వుద్యోగానికికూడా అప్లికేషన్ పెట్టించాడు. అది దొరికినా బోను బోను జీతం ఎక్కువచేస్తారట. అదీ ఆయన తృప్తి. ఒకవేళ అదీ దొరక్కపోతే, మూడవది నూటయాభైరూపాయల వుద్యోగం దొరికినా ఫర్వాలేదన్నాడు. పాపం! ఎక్కడికక్కడ తృప్తిపడే ఆయన్ను కోరికలూ, కొరతలూ అట్టే బాధించలేదనిపించింది. మిగతా చాలా వుద్యోగాలకు చాలాచోట్లకు పెద్దకొడుకుచేత అప్లికేషన్లు పెట్టించాడు. తండ్రిచేసే బహుముఖ ప్రయత్నాలు కొడుక్కు నచ్చలేదు. బ్యాంకులో వుద్యోగం కోసం ప్రయత్నించాంగదా, కొన్నాళ్లు ఆగి దొరక్కపోతే మిగతాచోట్ల ప్రయత్నించవచ్చు అంటాడు ఆ అబ్బాయి.

## 'కర్మయోగులు—'

కొన్నాళ్ళు ఆగేసరికి ఆవుద్యోగం దొరుకుతుందేమోఅన్న ఆశను పెంచుకుని గాలిమేడలు కట్టుకుంటే, రేపు ఆవుద్యోగం దొరక్కపోయేసరికి ఒక్కసారిగా నీవు కట్టుకున్న గాలిమేడలన్నీ కూలిపోయి, జీవితంలో మొదటిమెట్టులోనే దెబ్బతింటావు నాయనా! నీవు కావాలని కోరుకున్న వుద్యోగం దొరకలేదన్న కొరత నీ జీవితంలో మరేవుద్యోగంచేసినా తృప్తినివ్వదు-మనకు ప్రాప్తం ఏదైతేవుందో అది దొరుకుతుంది. నీ దృష్టి ఒకేవస్తువుమీద కేంద్రీకరిస్తే, ఒకవేళ ఆ వస్తువు దొరక్కపోతే, ఆ బాధ ఎవడు భరిస్తాడు? నీ అదృష్టం బాగుండి దొరికితే ఆవుద్యోగం సంతోషమే. అంతకంటే కావాలసిందేమీ లేదు. కాని దొరక్కపోతే బాధపడ్డానికి నేను సిద్ధంగా లేను. నీవు కూడా ఎక్కువ ఆశలు పెంచుకోవద్దని నా సలహా. ఆశ మోసంచేస్తుంది; కోరికలకు లోబడితే మనిషిని కృంగదీస్తాయి. ఈ రెండు విషయాలనూ తెలుసుకున్నరోజే మనం సుఖదుఃఖాలను సమంగా అనుభవించగలం—అని కొడుక్కు ఆయన చెబుతూంటే అర్జునిడికి భగవానుడు గీతబోధిస్తున్నట్లనిపించింది.

నిజంగా ఆయనమాటల్లో ఎంతసత్యం వుంది. ఆయనచెప్పిన విషయాలన్నీ అందరికీ తెలిసినవే. రోజూ అందరూ మాటాడుకునేవే. కాని ఆచరణలో పెట్టేవాళ్ళు ఎంతమంది? అందుకే ఆయనభార్య రోగిష్టిదైనా, కట్నాలివ్వలేని తన యిద్దరుకూతుళ్లూ పెండ్లీడుకొచ్చి ఇంట్లోవున్నా, పెద్దకొడుకును బి.యస్ సి. చదివించడానికి నానాఇబ్బందులు పడినా, ఆయన చలించలేదు. అలాఅని జీవితాన్నీ, సంసారాన్నీ కూడా తేలిగ్గా అలక్ష్యంగా తీసుకుంటూనూ పోవడంలేదు. ప్రతిక్షణం తనమీదవున్న బాధ్యతను గురించి, విశ్రాంతి అనేదిలేకుండా, నిష్కామ కర్మచేసే కర్మయోగి ఆయన. ఇదంతా కర్మానుభవం అయినప్పుడు, మాట్లాడకుండా అనుభవించడం నేర్చుకోవాలిగాని బాధపట్టానికీ,సంతోషపడ్డానికీ మనమెవరు? అంటాడాయన.

## దుఃఖభాగులు

కొందరికోరికలు తీరేఅవకాశం వుండీ కూడా లోభిత్వంతో వాళ్ళ వాళ్ళకోరికలను అడుగునిలుస్తుంటారు. అందుకు వాళ్ళలోని పిసినిగొట్టుతనమే కారణం.

అల్లాంటివాళ్ళ కోరికలు తీరలేదే అని బాధపడరు. కోరికలు ఎందుక్కలిగాయా అని తిట్టుకుంటారు. డబ్బు ఖర్చుపెట్టడానికి ప్రాణంపోయేట్లు బాధపడేవాళ్లే వాళ్లకోరికలతో పోట్లాడుతారు.

మా బంధువుల్లో ఒకావిడవుంది. ఆమె భర్త మంచిరాబడీ, పలుకుబడివున్న పెద్ద డాక్టరు. కొన్నోకూనో ఆ సీపాస్తీ కూడా వున్నవాడే. కాని సొంతఇల్లులేదు వాళ్లకు. ఆడాక్టరు దంపతులకు సొంతఇల్లు కొనుక్కోవాలన్నకోరిక చాలాకాలంగా వుందట. ఆకోరికను మనసులో పెంచకుండా తుంచేయాలని ఎంతో ప్రయత్నించింది డాక్టరుగారి పిసినారిభార్య. కాని అరిటిచెట్టులాంటికోరికను కోసేకొద్దీ పక్కన పిలకలు పెడుతుంటుంది! కనీసం ఇల్లు కొనక పోయినా, ఏదైనా కొద్దిగా స్థలం కొని ఇల్లు నెమ్మదిమీద కట్టించవచ్చు ... లేదా పాతఇల్లు చవగ్గాకొని పడగొట్టి తర్వాత కట్టించుకోవచ్చు. ఇత్యాది పిల్ల కోరికలు ఆవిడను ఏడిపించడం మొదలెట్టాయి మారాం చేసే పసిపిల్లలాగా—

ఒక్కకానీ ఖర్చుపెట్టడానికి ఇష్టపడని ఆవిడ మనసులో కోరికలను ఏమార్చడానికి ప్రతిరోజూ మధ్యాహ్నంపూట బయలుదేరి వూరంతా తిరిగేది ఇళ్లకోసం, స్థలాలకోసం. ...కాని ఒకటీ ఆవిడకు నచ్చేదికాదు—ఆవిడ మనసుకు నచ్చినా "అబ్బే చాలా ఖరీదు..." అని ఆవిడ లోభత్వం అడ్డుపడేది. దీని కెవరేంచేస్తారు...! ఏదో ఒక ఇల్లు త్వరగా కొందామని భర్త గోల పెడుతున్నా, ఆవిడమాత్రం ఏలాగో సమాధానపరచి కాలాన్ని నెట్టుకొస్తోంది—ఇప్పటికి పదిహేను సంవత్సరాలయింది. ఇంకా ఆ యిల్లాలు ఇల్లు కొననూలేదు, కట్టించనూ లేదు. కాని ఆవిడ చూడని ఇల్లూ, వెతకని స్థలమూ అంటూ లేవు ఈపదిహేను సంవత్సరాల్లోనూ — ఫలానా డాక్టరుగారి భార్య ఇల్లు కొనబోతూందట — అని ఎవరైనా అంటే "ఆ...మేం పుట్టినప్పట్నుంచీ ఆవిడ యిల్లు కొంటానని బెదిరిస్తూనే వుంది" అని అందరూ నవ్వడం పరిపాటి అయింది. ఇంకా సొంత యిల్లుకొనే ప్రాప్తమూ, వేళా రాలేదు గనకనే ఆవిడే ఆవిడకోరికకు అడ్డుగా నిలిచింది అనుకోవాల్సిందే!

సరిగ్గా డాక్టరుగారిభార్యలాంటిదే మావీధి చివరనున్న లేడీడాక్టరు జయమ్మ స్వభావం కూడా. మంచిపేరూ రాబడీవున్న జయమ్మ చూస్తూచూస్తూ ఒక్క నయాపైసా ఖర్చుపెట్టేదికాదు. ఏపూట కాపూట అర్ధణా, మిరపకాయలూ, కానీ చింతపండూ తెప్పించి కాలం వెళ్లబుచ్చుతూ వుండేది. పిల్లా జెల్లాలేని విధవరాలు జయమ్మకు అంత రాబడివుండీ, భర్త యిచ్చిపోయిన ఇల్లూ పొలాలూ ఆస్తివుండీ ఒక పూటకూడా కడుపునిండా అన్నంతిని, ఒంటినిండా బట్ట కట్టేదికాదు.

## అరగని కోరికలు

చిరుగులతో వుండే చీరతప్ప, శుభ్రంగా వుండే తెల్లచీర ఏనాడూ కట్టిన పాపాన పోలేదు జయమ్మ. చేతికొక పాత రిస్టువాచీ తప్ప ఒంటిమీద చిన్నమెత్తు బంగారం వేసుకునేదిగాదు. కొత్తగా వచ్చినవాళ్లు ఆవిణ్ణిచూసి ఏ నర్సో అనుకుని "జయమ్మగారు లేరా?" అని జయమ్మనే అడిగేవారట!

డాక్టరుగారి భార్య కనీసం అలరి పిల్లలాంటి తన కోరికలతో పోట్లాడి, వాటినోరు మూయడానికైనా ప్రయత్నించేది; జయమ్మ అలాకాదు. అగస్త్యుడు వాతాపిని మింగి బ్రేవ్‌మని తేన్చినట్లు జయమ్మ ఒక్కొక్క కోరికనూ మింగేస్తుండేది!

వాతాపి అయినా అగస్త్యుడి కడుపులో జీర్ణం అయినాడుగాని, ఎన్ని మింగినా జయమ్మ కోరికలు కొన్ని జీర్ణం కాలేదు. ఒకటి, కారు, రెండు, రేడియో, మూడు ఎలక్ట్రిక్ కుక్కరూ, నాలుగు, రిఫ్రిజిరేటరూ ఇత్యాది జీర్ణంకాని కోరికలు కొన్ని వుండేవి జయమ్మను పీడిస్తూ.

జయమ్మ తలుచుకుంటే తన కోరికలు క్షణంలో తీరిపోగలవు. కాని అంత డబ్బు

# ★ కోరికలూ - కొరతలూ ★

జయమ్మ బ్రతికుండగా ఖర్చు పెడుతుందా!

కాని ఇలాంటి పిసినిగొట్టు వాళ్ళకే అదృష్టం కలిసి వస్తుంటుంది. తన మనసులో పొట్లాడే కోరికలనుగురించి ఎవరికి చెప్పిందో ఏమో! ఒక భాగ్యవంతుల ఇంటి ఇల్లాలి కష్టపు కానుపు జయప్రదంగా చేసిందని జయమ్మకు ఆ ఇంటి యజమాని ఒక రేడియో కొని తెచ్చి బహుమతిగా ఇచ్చాడు, ఫీజుతోబాటు. ఇంక జయమ్మ సంతోషానికి మేరలేదు. తన సొంత డబ్బుతో ఈ జన్మలో కొనేదికాదు రేడియో. ఒకవేళ కొన్నా డబ్బుఖర్చుపెట్టి ఎందుకొన్నానా అనిఏడ్చేదే-ఇతర్ల ఖర్చుతో తనకోరికలు తీరి సంతసంతోషం కలిగేదికాదు. ఒకసారి మనిషి మాంసంతినడానికి అలవాటుపడిన పులిలాగా జయమ్మ తన కోరికల భారం తన దగ్గరకు కాన్పులకోసం వచ్చే భాగ్యవంతుల ఇంటి ఇల్లాళ్ళమీద వేయడం మొదలెట్టింది. చివరకు అగ్గిపెట్టె కావాలన్నా తను కొనాలనే సంగతి మర్చిపోయి ఆ ఖర్చుకూడా ఇతర్ల నెత్తిని రుద్దుతుండేదట!

కొందరు కోరికలు తీర కొద్దీ ఇంకా అసంతృప్తితోనే బాధపడుతుంటారు. కొందరు కోరుకున్న కోరికలు తీరితే ఆకలైనవ్వాడు అన్నం తిన్నంత తృప్తి పొందుతారు.

## 'ఈడేరిన' కోరిక

మొన్న నా స్నేహితురాలు నన్ను చూడ్డానికి మా ఇంటికి వచ్చింది. ఆధునిక పద్ధతుల్లో వున్న మా ఇల్లు వూరి చివర నున్న ఈ పదిహేనెకరాల తోటలో నే కట్టించడానికి కారణం ఏమిటని అడిగింది నా స్నేహితురాలు.

"చాలా కాలంగా నా మనసులోవున్న కోరిక" అన్నాను నవ్వుతూ.

"అల్లా చెప్పు! నీకు పల్లెటూరి వాతావరణం అంటే చాలా ఇష్టం అనుకుంటాను. అందుకే పాడీ పంటాకూడా వుంది మీ తోటలో-అసలు నీకీలాంటి కోరిక ఎన్నేళ్లనుంచి వుంది మనసులో?" అన్నది.

నిజంగానే నాకోరిక వయసు నాకు జ్ఞాపకం లేదు. నాకు ఊహ తెలిసి కోరిక అనేది కలిగిందంటే బహుశా పల్లెటూరి జీవితం కావాలనేదే నేమో.!

నాకు ఏడెనిమిదేండ్లు వచ్చేదాకా పల్లెటూర్లో వున్న మా తాత అవ్వలదగ్గిరే పెరిగాను.

మా తాతవాళ్ళ ఇల్లు యాభై ఎకరాల తోటలో వుండేది. ఆ తోటను ఆనుకునే మరొక యాభై ఎకరాల మెట్ట, మాగాణి భూములుండేవి తాతకు.

ప్రొద్దుటే లేచి అవ్వ కలిపిపెట్టిన మీగడ పెరుగన్నం తినేసి కొత్తగా పుట్టిన, ఆవు దూడలతో ఆడుకోడానికి పశువుల చావడి వైపు పరుగెత్తేదాన్ని. సాయంకాలం అయ్యేసరికి తాతవెంట తోటంతా షికారెళ్ళేదాన్ని. నిమ్మచెట్లూ, బత్తాయిచెట్లూ, అంటుమామిడిచెట్లూ, అరటిచెట్లూ కూరగాయల మళ్ళూ, అవ్వ వేసిన మల్లెతోటా అన్నీ దాటుకుని పొలాల్లోకి వెళ్ళేవాళ్ళం షికారుకు.

పంటకాలవలపక్కన కూర్చుని, కాళ్ళను నీళ్ళల్లో వుంచి ఆడిస్తూ చుట్టూ కలయచూసేదాన్ని ప్రకృతి సౌందర్యాన్ని. దూరాన కనిపించే కొండలూ, పక్కనే వంపులు తిరిగి పారుతూండే కొండవాగులూ, కనుచూపుమేరకు పచ్చగా కనిపించే పైరూ, పంటా చూడడానికి కన్నులపండువుగా వుండేది! ఆతర్వాత అన్నయ్యల చదువుకోసం నాన్న బస్తీకాపరం పెట్టాల్సివచ్చింది.

తాతా అవ్వావాళ్లు ఇల్లూ, తోటా, పొలాలూ, ఆవుదూడలూ అన్నిటినీ విడిచి వెళ్ళలేక ఎంత ఏడ్చానో చెప్పలేను.

బస్తీలోని తోటా దొడ్డీ లేని చాలీచాలని ఇండ్లల్లో వుండడం నాకు నచ్చలేదు.

పల్లెటూరివాతావరణంలో,తోటలోవున్న యింట్లో వుండాలనే నా చిన్నప్పటి కోరిక నాకు తెలీకుండానే నా మనసులో నాతోబాటు పెరుగుతూవచ్చింది. నాకుఊహ తెలిసిన తర్వాత నా కోరిక చాలా బలవత్తరమైనదనీ, ఎప్పటికైనా పల్లెటూరి వాతావరణంలో నే నుండకపోతే జీవితంలో నా మనసుకు శాంతిలేదనీ గ్రహించాను. దేనికైనా సమయం రావాలిగదా అని పెద్దవాళ్లన్నట్లు, సమయం కోసం కాసుకూర్చున్నాను—నా వివాహానంతరం నా చిన్ననాటి కోరిక కాస్త విజృంభించింది. ఇప్పుడైనా ఒక పెద్ద తోటలో ఒక చిన్న ఇల్లు కట్టించుకుని వుండకూడదా! అని-కాని సమయం రాలేదు నోరు మూసుకోమన్నాను నా కోరికను. చివరకు అయిదారేండ్లనాడు అంతకుముందు ఎన్నో సార్లు ప్రయత్నించినా మాకు దొరకని ఈ తోట సమయం రాగానే సులభంగా దొరికింది—ఈ మధ్యనే ఇలు కట్టించగలిగాం.

అయినా మా తాతవాళ్ల పల్లెటూరు సౌభాగ్యాన్ని ఈ పట్నంలో నేను తేలేకపోయినా, ఈ పదిహేనెకరాల తోటలో నే పల్లెటూరు వాతావరణాన్ని సృష్టించుకుని నా కోరికను తృప్తిపరచాను.

అదృష్టవంతురాలివి అన్నది నా స్నేహితురాలు.

## కోరికలు తీరక

నిజానికి ఒకందుకు నే నదృష్టవంతురాలినే. నేను కోరుకున్న పల్లెటూరు వాతావరణం పూర్తిగా దొరక్కపోయినా దొరికిన దానితో తృప్తిపడ్డాను.

ఏనాడూ నేను నా కోరికలకోసం పరుగులు తీయలేదు.

ప్రపంచంలో ప్రకృతి సహజమైన కోరికలు కొరతలూ ప్రతివాళ్ళకూ కలుగుతుంటాయి. కాని తృప్తితోనే కోరికలనూ కొరతలనూ కూడా జయించాలి. తృప్తిలేని వాళ్ళ కోరికలు తీరినా, తీరనట్లే బాధ పడతారు.

భగవంతుని స్వరూపమైన ఆత్మ ప్రతిక్షణం మనిషికి తను సహాయపడాలనే తాపత్రయపడుతుంది. మనిషి కష్టాలపాలు కాకుండా హెచ్చరిస్తుంది. కాని ముసలి వాళ్ళ సణుగుడులాగా మనిషి లోపల గొణిగే ఆత్మను ఎవరు లక్ష్యపెడతారు?

ఆవిధంగా వినిపించుకోకుండా కోరికల కోసం ఎంతనీచానికైనా సిద్ధపడే మనుషులు అథఃపాతాళానికి కృంగిపోయిన తర్వాతగాని ఏదో తనలోగల తనకోసం బాధపడుతోందని గ్రహించలేరు.

కోరికలు ఆత్మస్వరూపం తెలుసుకోలేక అజ్ఞానంతో లొంగిపోయే వారిని వేశ్యల్లాగా లొంగదీస్తాయి. లోభులదగ్గిర పసిబిడ్డల్లాగా మారాం చేస్తాయి. ఆత్మజ్ఞానం గలవారిదగ్గిర భయపడి హద్దుల్లో వుంటాయి. ప్రతిమానవుడూ తనలోవున్న ఆత్మస్వరూపాన్ని గుర్తించి, ఆత్మయొక్క సలహాననుసరించి జీవితంలో ముందుకు పోగలిగితే, ప్రపంచంలోని సుఖ, దుఃఖాలకు కారణమైన కోరికలనూ, కొరతలనూ సులభంగా జయించగలడు. ★